క్లుప్తంగా

రూబీజెస్ట్ -25 టెక్నికల్ ఫెస్ట్



కేయూ క్యాంపస్: ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు రూబీజెస్ట్ -25 టెక్నికల్ ఫెస్ట్‌ను కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు ఫెస్ట్ పోస్టర్లను కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు బుధవారం ఆవిష్కరించారు.

వీసీని కలిసిన హాస్టళ్ల జేడీలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో హాస్టళ్ల జాయింట్ డైరెక్టర్లుగా ఇటీవల నియమితులైన అధ్యాపకులు బుధవారం వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేశారు.

కేయూ రిజిస్ట్రార్‌కు సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంను పరిపాలన భవనంలోని చాంబర్‌లో సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్, సైకాలజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆయనకు మొక్క అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు రాజు, మల్లేశం, అరుణ్, విజయ్, రజిని, జుబేదా, సుచరిత, ఉమ పాల్గొన్నారు.

ఎస్సై మాధవ్‌కు అభినందన



హసన్‌పర్తి: ఇటీవల వెలువడి గ్రూప్ -1 పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన కాకతీయ యూనివర్సిటీ ఎస్సై మాధవ్‌గౌడ్‌ను భీమారంలోని సత్యసాయి కాలనీలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు సాంబయ్య, సభ్యులు ఉమాపతిరావు, రవీందర్, ప్రభాకర్, మహేందర్, సంపత్‌రావు, వెంకటేశ్వర్ రావు, నారాయణ రెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



మడికొండ: మడికొండలోని డంపిగ్ యార్డ్‌ను తొలగించాలని కోరుతూ ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్లానింగ్ కమిటీ వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి అడ్‌హక్ కమిటీ సభ్యులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈమేరకు ఆయన ఎండర్స్ చేసి ఇచ్చిన వినతిపత్రాన్ని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు కలెక్టరేట్‌లో అందజేశారు.

అడ్‌హక్ కమిటీ నియామకం

మడికొండ – రాంపూర్ మధ్య ఉన్న డంపింగ్ యార్డుతో పలు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోయారు. ఈమేరకు డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి రాంపూర్ అడ్‌హక్ కమిటీని బుధవారం నియమించారు. అనంతరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

'సీజీ' ఉత్సవాల్లో వినయ్‌భాస్కర్



హన్మకొండ: ఛత్తీస్‌గఢ్ దంతెవాడలోని ప్రసిద్ధ ఫాగున్ మడాయి ఉత్సవాల్లో మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పాల్గొన్నారు. ప్రస్తుత కాకతీయ వారసుడు మహారాజా కమల్‌చంద్ర భంజ్‌దేవ్ ఆహ్వానం మేరకు ఉత్సవాల్లో వినయ్‌భాస్కర్ బుధవారం పాల్గొన్నారు. దంతెవాడలోని శక్తిపీఠమైన దంతేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి



ఖిలా వరంగల్: రంజాన్ పండుగ ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌కు ఏర్పాట్లు చేయాలని ఈద్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ కోరారు. ఈమేరకు వరంగల్ వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండీ.రియాజ్‌ను ఫోర్ట్ రోడ్డు ఈద్గా కమిటీ ప్రతినిధులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జబ్బార్ మాట్లాడుతూ ఖిలా వరంగల్ ఈద్గా మైదానంలో ఈనెల 31న జరగనున్న రంజాన్ సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, కబ్రస్థాన్ అధ్యక్షుడు మీర్జా హసన్‌అలీ, ఎండీ.ముగ్దం, ఎండీ.సాదిక్, అంకూష్, సలీం, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు రోజులే!

రేషన్ బియ్యం పంపిణీకి గడువు

- ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ఇంకా 50 శాతం షాపులకు చేరని రైస్
- గోదాం ఇన్‌చార్జ్‌ను నిలదీస్తున్న డీలర్లు



బియ్యం కోసం వరంగల్ ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌ను నిలదీస్తున్న డీలర్లు

ఖిలా వరంగల్: రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతోంది. నెల చివరి నాటికి ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యాన్ని అందించేవారు. డీలర్లు వాటిని 1వ తేదీ నుంచి 15 వరకు పంపిణీ చేసేవారు. ఈనెల 12వ తేదీ దాటినా చాలా దుకాణాలకు బియ్యం రాలేదు. వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో 507 షాపులకుగాను 50 శాతం షాపులకు మాత్రమే బియ్యం చేరాయి. రైస్ మిల్లుల నుంచి సకాలంలో బియ్యం చేరకపోవడంతో ఎంఎల్ఎస్ పాయింట్లు ఖాళీగా కనిపిస్తున్నాయి. గోదాముల్లో బియ్యం ఎగుమతి, దిగుమతి లేక హమాలీ కార్మికులు ఖాళీగా ఉంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి..

జిల్లాలో వరంగల్, నర్సంపేట, వర్ధన్నపేటలో ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. వీటి ద్వారా అన్ని మండలాల్లోని గ్రామాలకు బియ్యం సరఫరా అవుతుంటాయి. ఏనుమాముల ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో వరంగల్ మండలానికి సంబంధించి 85 రేషన్ షాపులు ఉండగా.. 40 షాపులకు బియ్యం సరఫరా అయ్యాయి. ఖిలా వరంగల్ మండలంలో 72 రేషన్ షాపులు ఉండగా.. 35 షాపులకు సరఫరా చేశారు. గీసుకొండ మండలంలో 35 షాపులకు 10 షాపులకు చేరాయి. నర్సంపేట ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో నర్సంపేట, ఖానాపురం, దుగ్గొండి, నెక్కొండ, నల్లబెల్లి, చెన్నారావుపేట మండలాల్లో మొత్తం 182 షాపులు ఉండగా.. 75శాతం బియ్యం సరఫరా అయ్యాయి. వర్ధన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా వర్ధన్నపేట, సంగెం, రాయపర్తి, పర్వతగిరి మండలాల్లో మొత్తం 133 రేషన్ షాపులు ఉండగా.. 60 శాతంపైగా బియ్యం సరఫరా అయ్యాయి. ఏనుమాముల ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో 192 రేషన్ షాపులు ఉంటే మంగళవారం వరకు 85 షాపులకు మాత్రమే బియ్యం పంపించారు. దీంతో బియ్యం కోసం సామాన్య, మధ్య తరగతి ప్రజలు రేషన్ షాపుల చుట్టూ తిరుగుతున్నారు. పాత నిల్వలు ఉన్న కొంతమంది డీలర్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం విధించిన గడువు 15వ తేదీ వరకే ఉండడంతో డీలర్లు గోదాం వద్ద బియ్యం రాక కోసం ఎదురుచూస్తున్నారు. రోజుకు రెండు లారీలు మాత్రమే మిల్లర్ల నుంచి గోదాంకు రావడంతో డీలర్లు నాకు ముందు అంటే నాకు అంటూ గోదాం ఇన్‌చార్జ్‌తో గొడవకు దిగుతున్నారు.



బియ్యం నిల్వలు లేక వరంగల్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిద్రిస్తున్న హమాలీ కార్మికులు

గతనెల కంటే ఆలస్యం

జిల్లాలో వరంగల్, నర్సంపేట, వర్ధన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా అన్ని మండలాలకు రేషన్ బియ్యం సరఫరా చేస్తారు. మొత్తం 507 రేషన్ షాపులు ఉన్నాయి. 12వ తేదీ దాటినా ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం నిల్వలు లేవు. రైస్‌మిల్లుల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరిన వెంటనే ఇన్‌చార్జ్‌లు రేషన్ షాపులకు పంపిస్తున్నారు. సరఫరాలో గత నెల కంటే మరింత ఆలస్యమవుతోంది. రైస్‌మిల్లర్ల అలసత్వం వల్ల బియ్యం పంపిణీలో జాప్యమవుతోందని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బియ్యం అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

జిల్లా సమాచారం	
మండలాలు	13
రేషన్ షాపులు	507
రేషన్‌కార్డులు	2,66,662
ఎంఎల్ఎస్ పాయింట్లు	3
పంపిణీ చేస్తున్న బియ్యం	47,24,934 మెట్రిక్ టన్నులు

గడువు పెంచేందుకు చర్యలు

మిల్లుల నుంచి దొడ్డు బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరగానే షాపులకు పంపించేలా ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు ఇచ్చాం. జిల్లాలో 75శాతానికిపైగా రేషన్‌షాపులకు బియ్యం సరఫరా పూర్తి చేశాం. ప్రజలు, డీలర్లు ఆందోళన పడొద్దు. పంపిణీకి గడువు పెంచేలా చర్యలు తీసుకుంటాం.

\- సంధ్యారాణి, మేనేజర్, జిల్లా పౌరసరఫరాల శాఖ, వరంగల్

ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

కాజీపేట: చైతన్యపురి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆరు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ముగిశాయి. పద్మావతి, గోదాదేవి సమేత శ్రీనివాసుడి ఉత్సవ విగ్రహాలను వేద పండితులు ఊరేగింపుగా తీసుకెళ్లి నది జలాలతో శ్రీచక్రస్నానం చేయించారు. సప్త బావులు, సప్త నదుల జలాలతో ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేయించారు. వేద పండితుడు డాక్టర్ శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యుల ఆధ్వర్యంలో వారం రోజులుగా సాగుతున్న గణపతి హోమానికి భక్తులతో కలిసి పండితులు పూర్ణాహుతి నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా పూర్తిచేసిన పండితులు, బ్రాహ్మణోత్తములు, సన్నాయి మేళ కళాకారులకు దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డేపల్లి నరేందర్ నూతన వస్త్రాలు, కానుకలు అందించి సన్మానించారు. ఉత్సవాల్లో తిరునగరి దిలీప్ కుమార్, ఐలోని వెంకట మల్లారెడ్డి, పెద్ది అశోక్‌కుమార్, రాచర్ల శంకరయ్య, వంగాల సత్యనారాయణ రెడ్డి, శనిగరపు సుజాత పాల్గొన్నారు.



చక్రస్నానం చేయిస్తున్న పండితులు

మహిళలకు ఉపాధి కల్పించాలి

ఖిలా వరంగల్: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రత్నమాల డిమాండ్ చేశారు. ఎక్కువమంది పిల్లలను కనండి అంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపునివ్వడం సరికాదని అన్నారు. ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్‌లో టి.భవాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిరసన తెలిపారు.

కుల వివక్షపై పోరాటాలకు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

ఖిలా వరంగల్: శాస్త్ర, సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి ఆధునిక యుగంలో ఇంకా కుల వివక్ష, అంటరానితనం ప్రత్యక్ష, పరోక్షంగా కొనసాగుతోందని, వాటిపై ప్రతిఘటన పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేతలు సీహెచ్.రంగయ్య, అరూరి కుమార్ సూచించారు. వరంగల్ ఏసీరెడ్డినగర్‌లోని రఘునాథ భవనంలో ఉసిల్ల కుమార్, ఆవుల ఉదయ్‌కుమార్ అధ్యక్షతన కేవీపీఎస్ వరంగల్ జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు గుడిలో ప్రవేశంలేని గ్రామాలు, బతుకమ్మ ఆడనీయని గ్రామాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా కుల వివక్ష, అంటరానితనం కొనసాగుతోందని వాపోయారు.

దడువాయి చార్జీలు మార్కెట్ కమిటీ చెల్లించాలి

వరంగల్: వ్యవసాయ మార్కెట్‌లో పంట తూకం వేసే దడువాయి చార్జీలను మార్కెట్ కమిటీ చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జేడీఎం శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖను బుధవారం కలిసి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి మార్కెట్‌కు తీసుకొస్తే అనేక రకాల చార్జీలు వసూలు చేయడంతో రైతులపై అధిక ఆర్థికభారం పడుతోందని అన్నారు. ఈక్రమంలో బస్తాలు తూకం వేసే దడువాయి చార్జీలను మార్కెట్ కమిటీలు భరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, కోశాధికారి సిరుల రవీందర్, కమిటీ సభ్యులు మొకిడే పీరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఉద్యోగాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం

హన్మకొండ: ఉద్యోగాల్లో మాదిగలకు సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ (ఏఐయుఈసీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్ల శ్రీనివాస్ అన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

చట్టంచేసి ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

హసన్‌పర్తి: శాస్త్రీయంగా జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చట్టం చేసి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఆరెపల్లి పవన్ డిమాండ్‌చేశారు. హసన్‌పర్తి తహసీల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్గనైజర్ రాజారపు భిక్షపతి, ఎమ్మార్పీఎస్ నాయకులు సూర్యం, యాదగిరి, తాళ్ల సంపత్, మహేష్, గోపి, ప్రసాద్, రామంచ సంపత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

కేయూ క్యాంపస్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేవరకూ ఉద్యోగాల నియామకాలు చేపట్టొద్దని డిమాండ్ చేస్తూ ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కేయూలోని దూరవిద్య ప్రాంగణంలో నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధిపతి డాక్టర్ మామిడి లింగయ్య, బీఓఎస్ చైర్మన్ డాక్టర్ మంథిని శంకర్, ఎంఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాదిగ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

15న పీడీఎస్‌యూ రౌండ్‌టేబుల్ సమావేశం

కేయూ క్యాంపస్: యూజీసీ నూతన ముసాయిదా, డిటెన్షన్ విధానాలను వ్యతిరేకించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 15న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ పిలుపునిచ్చారు. కేయూలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూజీసీ నూతన ముసాయిదా.. యూనివర్సిటీల స్వయంప్రతిపత్తికి పెనుముప్పుగా మారిందని వాపోయారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి పవన్, నాయకులు రాజేష్, అనిల్, గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను మేకల వంశ వేదిక ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ పావుశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఉత్తమ మార్కులు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు సుమాదేవి, విజయలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేకల వంశ వేదిక అధ్యక్షుడు మేకల యుగంధర్, ప్రధాన కార్యదర్శి మేకల హరిశంకర్, కోశాధికారి శోభన్, ఉపాధ్యక్షుడు రమేష్, ఎస్ఎస్ ఫౌండేషన్ సభ్యుడు రవిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బోధన విధానాన్ని మార్చుకోవాలి

మామునూరు: అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధన విధానాన్ని మార్చుకోవాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, సత్యం గ్రూప్స్ ఫౌండర్ గంట రవికుమార్ సూచించారు. ఐనవోలు మండలం ఉప్పరపల్లి క్రాస్ రోడ్డులోని సత్యం కాన్వెషన్ హాల్‌లో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ 24వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చూపిన ఆదరణ, ప్రేరణతో తెలంగాణలో పలు బ్రాంచ్‌లు స్థాపించి అనతి కాలంలోనే ఆరు రాష్ట్రాలకు విస్తరించి తమ సేవలను అందిస్తున్నామని వివరించారు. సంస్థ డైరెక్టర్ కందుకూరి విజయ్‌కుమార్, సతీష్, ఎర్ర ప్రకాశ్, భాస్కర్, మామిడి రంజిత్, వడ్లకొండ రాజు, నారాయణ, నేరెళ్ల క్రాంతి, తొటం శ్రవణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్‌పై బీజేపీ జెండా ఎగురవేయాలి

హసన్‌పర్తి: కార్పొరేషన్‌పై బీజేపీ జెండాను ఎగురవేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ పిలుపునిచ్చారు. మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం బీజేపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి గురుమూర్తి శివకుమార్ ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారంపల్లి రాంచంద్రారెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ పెద్దమ్మ శ్రీనివాస్, నాయకులు దాసరి శ్రీనివాస్, మేకల హరిశంకర్, దాడి మధుసూదన్ పాల్గొన్నారు.

కాజీపేట నుంచి కాశీకి రైలు నడిపించాలి

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్ నుంచి కాశీ, అయోధ్య యాత్రకు ప్రత్యేక రైలు నడిపించాలని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ సూచించారు. ఆలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి నిత్యం వందలాది మంది కాశీ యాత్రకు వెళ్లాలని ఉన్నప్పటికీ సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో మిన్నకుండిపోతున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ నుంచి ఒక రైలే ఉండడంతో భక్తుల రద్దీ కారణంగా రిజర్వేషన్ దొరకడం లేదని పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విద్యారణ్యపురి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఏబీవీపీ ప్రాంత కార్యసమితి సభ్యుడు ఆరెపల్లి సుజిత్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఏబీవీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఏబీవీపీ వరంగల్ మహానగర్ కార్యదర్శి తాళ్లపెల్లి అరుణ్, బాధ్యులు భరత్, హరిచరణ్, శ్రీకాంత్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అమలు చేయాలి

ఖిలా వరంగల్: ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, కొత్త పెన్షన్లు వెంటనే ఇవ్వాలని సీపీఎం కరీమాబాద్ ఏరియా కమిటీ సభ్యుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ 32వ డివిజన్ కరీమాబాద్‌లో పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను పార్టీ కార్యకర్తలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాణి, ఉపేందర్, వెంకట చిమ్మని, భాగ్యలక్ష్మి, బోరగాని రమ్య, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -1 మెయిన్స్ రీవాల్యుయేషన్‌కు అవకాశం కల్పించాలి

విద్యారణ్యపురి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ -1 మెయిన్స్ ఫలితాల్లో రీకౌంటింగ్‌తో పాటు రీవాల్యుయేషన్‌కు అవకాశం కల్పించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేష్‌కు వేర్వేరుగా బుధవారం లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు మీడియంలో పరీక్ష రాసిన వారికి తక్కువ మార్కులు వచ్చాయన్నారు.

రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో వైద్య శిబిరం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మేరకు పలువురికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి, అవసరమున్న వారికి మందులు అందజేశారు.

నేడు ఉచిత థైరాయిడ్ వైద్యశిబిరం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని లతా వెంకట్ ఆర్థో అండ్ జనరల్ కేర్ ఆస్పత్రిలో గురువారం ఉదయం ఉచిత థైరాయిడ్ వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎడ్ల బండి సంఘం నాయకుడి మృతి

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఎడ్ల బండి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డమీది సాంబయ్య బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతిపై సంఘం నాయకులు, సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్సారెస్పీ కాల్వలో మృతదేహం లభ్యం

హసన్‌పర్తి: కరీంనగర్ – ఖమ్మం వైపునకు వెళ్లే ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ మార్గమధ్యలోని గుండ్ల సింగారం వద్ద ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైందని కాకతీయ పోలీసులు తెలిపారు. వివరాలకు 87126 85115, 87126 85088 నంబర్లలో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సూచించారు.

బాధితుడికి మొబైల్ అప్పగింత

హసన్‌పర్తి: పోగొట్టుకున్న మొబైల్‌ను బాధితుడికి పోలీసులు అప్పగించారు. ముచ్చర్లకు చెందిన గుడికందుల సంపత్ ఇటీవల తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ మొబైల్‌ను గుర్తించి బుధవారం అందజేసినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

చెరువు సుందరీకరణకు నిధులు కేటాయించండి

హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురంలోని ఊర చెరువు సుందరీకరణకు నిధులు కేటాయించాలని ప్రజాతంత్ర ఆలోచన వేదిక వ్యవస్థాపకుడు తుపాకుల దశరథం కోరారు. ఈమేరకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బుధవారం లేఖ రాశారు. సుందరీరణ కోసం చెరువుకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం చెరువులోకి మురుగునీరును వదులుతున్నారని పేర్కొన్నారు. అండర్ డ్రెయినేజీ ఏర్పాటు చేసి మురుగు నీరును మళ్లించాలని సూచించారు. ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన డెయిరీని తొలగించాలని కోరారు. అక్కడ బతుకమ్మ ఉత్సవాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దశరథం తెలిపారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

హసన్‌పర్తి: నగరంలోని పెగడపల్లి డబ్బాల వద్ద సుమారు 3కిలోల 200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కాకతీయ యూనివర్సిటీ పోలీసులు తెలిపారు. నిందితుడు దామెర మండలం పులుకుర్తికి చెందిన దుప్పటి ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు కేయూ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరించారు.

మడికొండలో చోరీ

మడికొండ: మడికొండ వాల్మీకినగర్‌లోని మాచర్ల రాజుగౌడ్ ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు 13గ్రాముల నల్లపూసల గొలుసు, 10గ్రాముల బంగారు నెక్లెస్ చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

ఉర్సు ప్రతాప్‌నగర్‌లో చోరీ

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్ ప్రతాప్‌నగర్‌లోని తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. 5వేల విలువైన వెండి, బంగారు వస్తువులు, రూ.10వేల నగదు అపహరణకు గురైందని బాధితురాలు కందగట్ల రాణి ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు అందజేత

వరంగల్ క్రైం: బంగారు గొలుసు పోగొట్టుకున్న బాధితురాలికి తిరిగి అప్పగించినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- సైబర్ క్రైం డీఎస్పీ విజయ్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

మామునూరు: సైబర్ నేరాలపై యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ విజయ్‌కుమార్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సైబర్ క్రైం పోలీసుల ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రకాశ్ అధ్యక్షతన డిజిటల్ భద్రత, వాటి ప్రభావాలు, సైబర్ నేరాలు, రక్షణ చర్యలు, న్యాయపరమైన అంశాలపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు అనేక రకాల మోసాలకు పాల్పడుతున్నారని, ఈక్రమంలో ఫోన్‌కు వచ్చే కాల్స్, మెసేజ్, లింక్‌లకు స్పందించవద్దని సూచించారు. డిజిటల్ భద్రతపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. విద్యార్థులను సురక్షితమైన డిజిటల్ వాతావరణం వైపు మళ్లించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అయేషాభాను, సత్యవతి, తన్వీర్ జహాన్, పల్లవి, మహేశ్వరి, డీన్ శశిధర్, రిటైర్డ్ ప్రొఫెసర్‌శర్మ పాల్గొన్నారు.

ఘనంగా జిల్లాస్థాయి యువ ఉత్సవ్



యువ ఉత్సవ్‌లో కళాకారుల ప్రదర్శన

వరంగల్: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జిల్లాస్థాయి యువ ఉత్సవ్–2025ను ఘనంగా నిర్వహించారు. జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముస్తాక్‌అలీ మాట్లాడారు. యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ సాంస్కృతిక పోటీలు దోహదపడుతాయని తెలిపారు. ముఖ్య అతిథి వరంగల్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రతిభకు యువకులు తార్కాణంగా నిలుస్తున్నారని, నృత్యం, కవితారచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులతోపాటు ప్రశంసపత్రాలు అందజేశారు. సత్యం కంప్యూటర్స్ చైర్మన్ గంట రవికుమార్, ఫిలిం సెన్సార్ బోర్డు డైరెక్టర్ ఆకుల నాగేశ్వర్, మామునూరు ఇన్‌స్పెక్టర్ రమేశ్, నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేశ్, కళాశాల అధ్యాపకులు రమేశ్, ఎన్ఎస్ఎస్ పీఓ మొహమ్మద్ ఆజం, శ్వేత, వలంటీర్లు భరత్, సాయి, శ్రావణి, శివాజీ, శ్రావణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు 15శాతం బడ్జెట్ కేటాయించాలి

హన్మకొండ: విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టరేట్ల వరకు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రౌతు రమేష్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి విస్మరించిందని విమర్శించారు. విద్యారంగానికి అవసరమైన నిధులు కేటాయించి పాఠశాలలు బాగు చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, నాయకులు పసుల దాసు, గోవింద్ అనిత, దుర్గం పుష్పలత, గాజుల రాజు, సందెల పౌల్, గోవింద్ ప్రతాప్ పాల్గొన్నారు.



హన్మకొండ: మాట్లాడుతున్న నాయకులు

కేయూ క్యాంపస్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ కేయూ అధ్యక్షుడు మెరుగు సాయికుమార్ డిమాండ్ చేశారు. కేయూలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో విద్యారంగానికి కేవలం 7శాతం నిధులే కేటాయించారని ఎద్దేవాచేశారు. సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూజ, బాధ్యులు సాయిప్రియ, అభినయ్, ఫణీంద్ర, తరుణ్, సాగర్, ఉదయ్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.